

కుట్టు మిషన్ కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం మిషన్ తొక్కుతున్న నగర మేయర్ గద్వాల్ విజయ లక్ష్మి

మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలి

● మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

బంజారాహిల్స్, సెప్టెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళకు ఆర్థిక ప్రగతి సాధించాలని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. భోళా నగర్‌లో సహారా గ్రూప్ ఏర్పాటు చేసిన కుట్టు మిషన్ కేంద్రాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రేటర్‌లో సుమారు 47,960 స్వయం సహాయక సంఘాలలో 4,47,631 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారని అన్నారు. ఇందిరా మహిళా శక్తి క్రింద 7000 ఎంటర్ ప్రైజెస్ గ్రూప్‌లకు, మహిళలకు రూ.410 కోట్లు ఈ ఆర్థిక సంవత్సరంలో పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. మైక్రో క్రెడిట్ ద్వారా ఇప్పటికే 1718 గ్రూప్ లకు రూ.186.25 కోట్లు ఆర్థిక సహాయం అందజేసినట్లు చెప్పారు. మహిళలను అన్ని రంగాల్లో ప్రోత్సహించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ (యూసీడీ) చంద్రకాంత్ రెడ్డి, జోనల్ కమిషనర్ రవి కిరణ్, యూసీడీ అధికారులు, సహారా గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.

రేపు బోరబండలో ఉచిత వైద్య శిబిరం

బంజారాహిల్స్, సెప్టెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): స్వర్ణ భారత్ ట్రస్ట్ హైదరాబాద్ చాప్టర్, ఏఐజీ హాస్పిటల్స్ బంజారాహిల్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 15న బోరబండలోని నాట్కో ప్రభుత్వ పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. గుండె, నరాలు, ఊపిరి తిత్తులు, జీర్ణకోశం, సాధారణ వ్యాధులకు సంబంధించి అనుభవజ్ఞులైన వైద్యులు శిబిరంలో పాల్గొని వైద్య సలహాలు అందజేస్తారు. వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్వర్ణ భారత్ ట్రస్ట్ నిర్వాహకులు సూచించారు. ఇతర వివరాలకు 9963277544 ఫోన్ నంబర్‌లో సంప్రదించవచ్చు.

బీఆర్ఎస్ నేతల ముందస్తు అరెస్ట్



ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఇంటి ముందు బందోబస్తు

బంజారాహిల్స్, సెప్టెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యేలు ఆరికెపూడి గాంధీ, కౌశిక్ రెడ్డి మాటల యుద్ధంలో భాగంగా శుక్రవారం ఆరికెపూడి గాంధీ నివాసాన్ని ముట్టడించనున్నట్లు బీఆర్ఎస్ ప్రకటించడంతో పోలీసులు ముందస్తు అరెస్టులు చేపట్టారు. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌ని హౌస్ అరెస్టు చేసి ఆయన బయటకు రాకుండా మాదాపూర్ పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్పొరేటర్లు వెల్దండ వెంకటేష్, మన్నె కవితా రెడ్డి, దేదీప్యరావు, రాజ్‌కుమార్ పటేల్, ఖైరతాబాద్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డిని హౌస్ అరెస్టు చేశారు.

బీఆర్ఎస్ నేతల అక్రమ అరెస్ట్ హేయమైన చర్య



ఉప్పలపాటి అనూషరామ్

యూసుఫ్‌గూడ, సెప్టెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన ముసుగులో రేవంత్‌రెడ్డి నియంతగా వ్యవహరిస్తూ ప్రతిపక్ష బీఆర్ఎస్ నేతలను అక్రమంగా అరెస్ట్ చేసి నిర్బంధం చేయటం హేయమైన చర్య అని ఖైరతాబాద్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకురాలు ఉప్పలపాటి అనూషరామ్ అన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై దాడి చేసిన వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చయాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి హరీశ్‌రావు, నాయకుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు దారుణమన్నారు. దాడి చేసిన కాంగ్రెస్ నేతలను వదిలేసి బీఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేయటం సిగ్గుచేటన్నారు. అరెస్టులకు బెదరమని, అధికారం ఎవరికీ శాశ్వితం కాదని, అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ పార్టీకి ప్రజాక్షేత్రంలో గుణపాఠం తప్పదని ఆమె అన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఫాదర్ స్వామిరాజ్

క్రిస్టియన్ మైనారిటీలను విశ్వవిద్యాలయం ఉప కులపతిగా నియమించాలి

పంజాగుట్ట, సెప్టెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం త్వరలో భర్తీ చేయనున్న విశ్వవిద్యాలయాల ఉప కులపతి పోస్టులలో క్రిస్టియన్ మైనారిటీలకు అవకాశం కల్పించాలని తెలంగాణ క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఫాదర్ స్వామి రాజ్, ఫాదర్ బాస్కో, ఫాదర్ డేవిడ్, చిట్టిబాబు, జేఏసీ ప్రతినిధులు మాట్లాడారు. విశ్వవిద్యాలయాల ఉప కులపతుల భర్తీలో సామాజిక న్యాయాన్ని ప్రోత్సహించేందుకు క్రిస్టియన్ మైనారిటీలను ఉప కులపతిగా నియమించాలని వారు అన్నారు. దేశంలో విద్యా రంగానికి క్రైస్తవ సంస్థలు చేసిన కృషి ఎంతో గణనీయమైందని అన్నారు. ముందు నుంచి కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా నిలుస్తున్నామని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో జేఏసీ నాయకులు పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితులతో ఎక్సైజ్ అధికారులు

ఎండు గంజాయి సరఫరా చేస్తున్న ఇద్దరి అరెస్టు

బంజారాహిల్స్, సెప్టెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): గట్టు చప్పుడు కాకుండా ఎండు గంజాయి తరలిస్తున్న ఇద్దరిని ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జూబ్లీహిల్స్ ఎక్సైజ్ శాఖ అధికారులు రోడ్డు నంబరు 10లో వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై పెద్ద మూటతో వెళుతుండగా పోలీసులు ఆపారు. తనిఖీ చేయగా ఆ మూటలో 8.6 కిలోల ఎండు గంజాయి లభించింది. నిందితులు బిహార్‌కు చెందిన చమన్‌కుమార్ సాహ్, హఫీజ్‌పేటకు చెందిన సాయినాథ్‌ను అరెస్టు చేసి వారినుంచి వాహనాన్ని, గంజాయిని సీజ్ చేసినట్టు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వాసుదేవరావు తెలిపారు.

ఎస్‌బీఐ ఇన్సూరెన్స్ అంటూ మోసం

యూసుఫ్‌గూడ, సెప్టెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): ఎస్‌బీఐ ఇన్సూరెన్స్ నుంచి ఫోన్ చేస్తున్నామని మాట్లాడుతూనే నగదు మాయం చేసిన సంఘటనపై మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రహ్మత్‌నగర్‌లో నివాసం ఉంటున్న కె.రఘుసూర్య సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుంటాడు. ఈ నెల 2వ తేదీ ఎస్‌బీఐ ఇన్సూరెన్స్ పేరుతో ఫోన్ వచ్చింది. ఆ ఫోన్ మాట్లాడుతుండగా తన క్రెడిట్ కార్డు నుంచి రూ. 92,031 రూపాయలు డెబిట్ అయినట్లు మెసేజ్ వచ్చింది. వెంటనే ఈ ట్రాన్‌జక్షన్ మీదయితే 1 నొక్కండి, లేదంటే 2 నొక్కండి అని మెసేజ్ వచ్చింది. వెంటనే 2 నొక్కాడు. తరువాత రూ.5 వేలు ట్రాన్‌జక్షన్ క్యాన్సిల్ అయిందని మెసేజ్ వచ్చింది. దీంతో రఘుసూర్య సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అనంతరం మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆడంబరాలకు దూరంగా.. ఆధ్యాత్మికత ఉట్టిపడేలా..

● కృష్ణానగర్ సీ-బ్లాక్‌లో సంప్రదాయబద్ధంగా నవరాత్రి ఉత్సవాలు
● 14 ఏళ్లుగా మట్టి గణపతి విగ్రహంతోనే వేడుకలు
● మాలధారణతో భక్తిభావం వెల్లివిరిసేలా కార్యక్రమాలు

యూసుఫ్‌గూడ, సెప్టెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): పండుగలంటేనే సంప్రదాయానికి ప్రతీక. అయితే కాలానుగుణంగా పండుగల వేడుకల్లో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. సహజత్వానికి భిన్నంగా ప్రజలు ఆడంబరాలకు పోతున్నారు. కానీ కృష్ణానగర్ సీ-బ్లాక్‌లో వాసవి యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే బాల వినాయక నవరాత్రి మహోత్సవాల్లో మాత్రం ఇప్పటికీ సంప్రదాయం ఉట్టిపడుతోంది. 2011 నుంచి ఇక్కడ మట్టి గణపతిని ప్రతిష్ఠిస్తుండటంతో పాటు గణపతి మాల ధరించిన దీక్షాదారులతో పూజాదికాలు నిర్వహిస్తూ సంప్రదాయబద్ధంగా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ప్రతి ఏడాది వినాయకచవితి సమయంలో మట్టి విగ్రహాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేస్తున్నారు. వీరు చేస్తున్న కార్యక్రమాల గురించి తెలిసిన పలువురు ప్రముఖులు, సినీ నటులు ఇక్కడ ఏర్పాటు చేసిన గణేశ్ మండపంలో పూజలు చేస్తుంటారు.

గణపతి మాల, లక్ష కుంకుమార్చన ప్రత్యేకం..

వినాయకచవితి పండుగ రోజు వాసవి యువజన సేవా సంఘం సభ్యులు గణపతి మాల ధరిస్తారు. వారంతా నవరాత్రులు ముగిసే వరకు గణేష్ మండపంలోనే ఉంటూ నిత్యం రెండు పూటలా స్వామివారికి పూజలు చేస్తారు. నవరాత్రులలో ఒక రోజు లక్ష కుంకుమార్చన నిర్వహిస్తారు. ఈ సారి 13వ తేదీన లక్ష కుంకుమార్చన పూజ చేశారు. ప్రతి సంవత్సరం పసుపు, కుంకుమ దుంపలను ఏజెన్సీ ప్రాంతం నుంచి తెప్పించి ఇక్కడే మహిళలు వాటిని ఎండపెట్టి దంచి పసుపు, కుంకుమ తయారు చేసి ఈ పూజలో ఉపయోగిస్తారు. అన్నవరం నుంచి తెప్పించిన ప్రత్యేక ప్రతిమలతో లక్ష కుంకుమార్చన పూజలు చేస్తారు.



మండపంలో ఏర్పాటు చేసిన మట్టి గణపతి





భోజనాలు వడ్డిస్తున్న సినీ దర్శకుడు బోయపాటి శ్రీను(ఫైల్)
గణపతి మండపంలో పూజలు చేస్తున్న హీరోయిన్ రకుల్ ప్రీత్‌సింగ్ (ఫైల్)

ఆత్మీయతతో అన్నదానం..

ప్రతి ఏడాది క్రమం తప్పకుండా నవరాత్రులకు అన్నదానం చేస్తుంటారు. సంఘం సభ్యులే స్వయంగా వంట చేసి 21 రకాల వంటకాలతో భక్తులకు దగ్గరుండి భోజనాలు వడ్డిస్తారు. భోజనాలకు వచ్చిన మహిళలకు సంఘంలోని మహిళా సభ్యులు స్వాగతం పలుకుతూ గంధం, కుంకుమతో బొట్టు పెట్టి ఇస్తరాకు చేతికి అందిస్తారు. పురుషులకు సైతం నమస్కరిస్తూ ఎంతో ఆత్మీయతతో వడ్డించడం ఇక్కడి ప్రత్యేకత. ఈ అన్నదాన కార్యక్రమానికి స్థానికులతో పాటు కొందరు ప్రముఖులు సైతం వచ్చి భోజనాలు చేస్తుంటారు. ఈ ఏడాది 15వ తేదీన అన్నదానం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.





గణపతి మాలధరించిన సంఘం సభ్యులు, దీపాలతో గణేశుడికి వీడ్కోలు పలుకుతూ.. (ఫైల్)

సంప్రదాయబద్ధంగా నిమజ్జనం..

ఆధ్యాత్మికత ఉట్టిపడేలా గణేశ్ నిమజ్జన కార్యక్రమం నిర్వహిస్తారు. చివరిరోజు పూజ అనంతరం లడ్డూ వేలం వేసిన తర్వాత గణపతి ఊరేగింపు ప్రారంభిస్తారు. మహిళలు సంప్రదాయబద్ధంగా వస్త్రాలు ధరించి దీపాలు చేతపట్టి గణపతికి ఇరువైపులా బారులుతీరి వీడ్కోలు పలుకుతారు. పూర్తిస్థాయి భక్తిభావంతో ఎలాంటి కృత్రిమ ఆడంబరాలు లేకుండా నిమజ్జన కార్యక్రమాన్ని పూర్తి చేస్తారు.

గొప్ప కళాకారులను ప్రపంచానికి పరిచయం చేసిన ఘనత మనది

● విశ్రాంత న్యాయమూర్తి చంద్రకుమార్

బంజారాహిల్స్, సెప్టెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): ఎంతోమంది గొప్ప కళాకారులను ప్రపంచానికి పరిచయం చేసిన దేశం మనదని హైకోర్టు రిటైర్డ్ జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. మాదాపూర్‌లోని స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఏర్పాటు చేసిన ఇంటర్నేషనల్ ఆర్ట్ షోను ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ మనుషులతో పోలిస్తే ఆర్టిస్టుల దృష్టి వేరే రకంగా ఉంటుంది అని ఎంతో కళాత్మకంగా వాళ్ల ప్రపంచాన్ని చూస్తారని అన్నారు. ప్రపంచ ప్రసిద్ధి చెందిన కళాకారులను ఈ దేశం ప్రపంచానికి అందించిందని గుర్తు చేశారు. ప్రకృతిని ఆర్టిస్టులు మరింత అందంగా ఇక్కడ తీర్చిదిద్దిన తీరు నన్ను బాగా ఆకట్టుకుందన్నారు. నిర్వాహకులు క్యూరేటర్ స్టాలిన్ మాట్లాడుతూ ఈ నెల 17 వరకు ఈ ఆర్ట్ షో కొనసాగుతుందని ఈ షోలో వివిధ దేశాలకు చెందిన ఆర్టిస్టులు 150 మందికి పైగా పాల్గొన్నారని తెలిపారు. విభిన్న రకాల పెయింటింగ్స్‌ని ఇక్కడ ప్రదర్శిస్తున్నామని తెలిపారు. సౌత్ ఇండియాలోనే తొలిసారిగా పికాసో ఒరిజినల్ ఆర్ట్ ఇక్కడ ప్రదర్శిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ డాక్టర్ అమిత్ సాదుఖాన్, క్యూరేటర్లు శంకర్, అశోక్ మచ్చ పాల్గొన్నారు.



చిత్ర ప్రదర్శనను తిలకిస్తున్న హైకోర్టు రిటైర్డ్ జస్టిస్ చంద్రకుమార్

అధిక వడ్డీ పేరుతో భారీ మోసం

● పెట్టుబడి పేరిట డీకేజెడ్ టెక్నాలజీస్ సంస్థ నిర్వాకం
● రూ.700 కోట్ల వరకు వసూలు చేశారంటున్న బాధితులు
● పోలీసులకు ఫిర్యాదు చేస్తే పట్టించుకోవడం లేదని ఆవేదన
● సీసీఎస్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగిన బాధితులు



బాధితులతో కలిసి మాట్లాడుతున్న న్యాయవాది ఆషిర్ ఖాన్

పంజాగుట్ట, సెప్టెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): అధిక వడ్డీ పేరుతో తమను డీకేజెడ్ టెక్నాలజీస్ సంస్థ మోసం చేసిందని బాధితులు తెలిపారు. ఈ నెల 4న నగర సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని.. కేసు తమ పరిధిలోకి రాదని, సైబరాబాద్ వెళ్లమన్నారని వాపోయారు. ఈ మేరకు పోలీసుల తీరుకు నిరసనగా బాధితులు సీసీఎస్ కార్యాలయం ఎదుట శుక్రవారం ఆందోళనకు దిగారు. అంతకు ముందు సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో న్యాయవాది ఆషిర్ ఖాన్‌తో కలిసి బాధితులు మాట్లాడారు. అశ్ఫక్ రాహిల్ అనే వ్యక్తి 2018లో మాదాపూర్‌లో డీకేజెడ్ టెక్నాలజీస్‌ను స్థాపించారని.. అందులో పెట్టుబడి పెట్టుబడి పెట్టగా మొదట్లో 8 నుంచి 12 శాతం వడ్డీ చెల్లించడంతో ఆ తర్వాత భారీగా డబ్బులు ఇచ్చినట్లు తెలిపారు. తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక సహా విదేశాలకు చెందిన వారు పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టారన్నారు. జూన్‌లో సంస్థ కార్యాలయానికి వెళ్లగా మూసివేసి ఉందని, నిర్వాహకులకు ఫోన్ చేసినా స్విచ్ఛాఫ్ వస్తుందన్నారు. 20 వేల మందికి పైగా బాధితులు ఉండగా.. సుమారు రూ.700 కోట్ల వరకు మోసపోయినట్లు తెలిపారు. తన కుటుంబ సభ్యులు, బంధువులు కలిసి రూ.2.72 కోట్ల వరకు పెట్టుబడి పెట్టామని మెహిదీపట్నంకు చెందిన డాక్టర్ అబుల్ జైష్ వాపోయారు. ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సైబర్ నిందితుడి అరెస్ట్

సిద్దిపేట క్రైం, సెప్టెంబర్ 13: ఆన్‌లైన్ ట్రేడింగ్ ఇన్వెస్ట్‌మెంట్‌లో డబ్బులు పెడితే ఎక్కువ మొత్తంలో లాభాలు వస్తాయని నమ్మించి మోసం చేసిన ఒక సైబర్ నిందితున్ని సిద్దిపేట సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్ ఏసీపీ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం... హైదరాబాద్‌కు చెందిన భీమిశెట్టి వెంకటరామ్ సిద్దిపేట పట్టణంలో పనిచేసే ఒక బ్యాంకు మేనేజర్‌కు వాట్సాప్‌లో, మెయిల్‌కు ఒక లింక్ పంపించి ఇందులో పెట్టుబడి పెడితే ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో ఎక్కువ మొత్తంలో డబ్బులు వస్తాయని చెప్పగానే అది నమ్మి ఆశపడి సదరు బ్యాంకు మేనేజర్ ఆన్‌లైన్ ద్వారా, గూగుల్ పే, ఫోన్ పే ద్వారా ఆన్‌లైన్ నెట్ బ్యాంకింగ్ ద్వారా 25 రోజులలో రూ.80 లక్షల రూపాయలు పంపించారు. తదుపరి నిందితునికి ఫోన్ చేయగా సెల్ స్విచ్‌ఆఫ్ చేశాడు. మళ్లీ కాంటాక్ట్ రానందున నమ్మించి మోసం చేసినారని అనుమానంతో జాతీయ సైబర్ సెల్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కాల్ చేసి వివరాలు తెలిపి సిద్దిపేట సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో బాధితుడు దరఖాస్తు ఇవ్వగా కేసు నమోదు చేసి పరిశోధన ప్రారంభించారు. కేసు పరిశోధనలో నిందితుని వివిధ బ్యాంకు అకౌంట్లో ఫ్రీజ్ అయిన రూ.20 లక్షలు సంబంధిత బ్యాంకు మేనేజర్‌కు ఇప్పించారు. కేసు పరిశోధనలో భాగంగా టెక్నాలజీ ద్వారాపై నిందితున్ని శుక్రవారం హైదరాబాద్ హైటెక్ సిటీ వద్ద అదుపులోకి తీసుకొని జరిగిన ట్రేడింగ్ మోసం గురించి విచారించి నిందితుని వద్ద నుంచి రూ.50 వేల రూపాయలు నగదు, నిందితుడు ఉపయోగించిన సెల్ ఫోన్, రెండు బ్యాంకులకు సంబంధించిన చెక్ బుక్‌లు స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్ పంపించినట్లు ఏసీపీ తెలిపారు.



ఫిలింనగర్ యువజన సంఘం ఏర్పాటు చేసిన భారీ గణనాథుడిని దర్శించుకున్న ఎమ్మెల్యే దానం నాగేందర్ దంపతులు

లడ్డూ వేలం పాట

బంజారాహిల్స్, సెప్టెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): వినాయక మండపాల వద్ద లడ్డూ వేలం పాటలు మొదలయ్యాయి. భగత్‌సింగ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన వినాయకుడి లడ్డూను సెనావత్ రాంచందర్‌నాయక్ రూ.73 వేలకు దక్కించుకున్నారు. బీజేవైఎం నగర అధ్యక్షుడు చట్టిబోయిన సందీప్ యాదవ్, నాయకుడు గందె అరుణ్‌కుమార్ లడ్డూను అందచేశారు. ఫిలింనగర్ యువజన సంఘం ఫిలింనగర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన భారీ గణపతికి ఎమ్మెల్యే దానం నాగేందర్ దంపతులు పూజలు చేశారు.



వేలంలో లడ్డూను దక్కించుకున్న సెనావత్ రాంచందర్ నాయక్

ఆర్ఎస్ఎస్ విశ్వ విభాగ్ ప్రచారక్ భీష్మా చారి మృతి



ఖైరతాబాద్, సెప్టెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) విశ్వ విభాగ్ ప్రచారక్ మల్లాపురం భీష్మాచారి(73) ఆకస్మికంగా మృతి చెందారు. సంస్థలో పూర్తి సమయం ప్రచారక్‌గా పని చేస్తున్న ఈయన చిన్నప్పటి నించి స్వయం సేవక్‌గా పనిచేస్తూ 1970 నుంచి ప్రచారక్‌గా ఉంటూ సంగారెడ్డిలో, తమిళనాడులో 15 సంవత్సరాలు, 8 సంవత్సరాలు పంజాబ్‌లో ప్రచారక్‌గా పనిచేసి ఫిజీ, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, మలేషియా దేశాల్లో సంఘం కోసం పని చేశారు. గురువారం నాగపూర్‌లో సంఘ కార్యకర్తలను కలిసి తిరుగు ప్రయాణం లో రైలులో ఉండగా వార్ధ జిల్లా సేవగ్రామ్ వద్ద గుండెపోటు రావడంతో రైల్వే అధికారులు ఆస్పత్రికి తరలిస్తుండగా చనిపోయారు. ఖైరతాబాద్ లోని వారి స్వగృహంలో అనంతరం స్థానిక సరస్వతి విద్యామందిర్ పాఠశాలలో సందర్శకుల కోసం ఉంచి శనివారం మధ్యాహ్నం అనంతరం పంజాగుట్ట శ్మశాన వాటికలో అంతిమ సంస్కారాలు చేస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.

నృత్యంలో అలరించిన చిన్నారులు

ఎర్రగడ్డ, సెప్టెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): రాజీవ్‌నగర్ కాలనీ గణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన క్లాసికల్ నృత్య పోటీల్లో కాలనీ మహిళలు, చిన్నారులు అలరించారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ కిలారి మనోహర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఉత్సవాలను ఘనంగా నిర్వహించి బహుమతులను అందజేస్తున్నట్లు తెలిపారు.



ఏడు రోజులుగా పూజలందుకున్న గణనాథులను ట్యాంక్‌బండ్‌లో నిమజ్జనానికి తీసుకువస్తున్న భక్తులు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పంజాగుట్ట, సెప్టెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల కారణంగా బంజారాహిల్స్‌లోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 10 నుంచి ఉదయం 11.30 గంటల వరకు 11కేవీ సాగర్ సొసైటీ ఫీడర్ పరిధిలో, ఉదయం 10.30 నుంచి 11 గంటల వరకు 11 కేవీ కాకతీయ హిల్స్ ఫీడర్ పరిధిలో, ఉదయం 11 నుంచి 11.30 గంటల వరకు 11 కేవీ హోటల్ దస్పల్లా, ఏపీఐఐసీ-2, అపోలో ఆసుపత్రి ఫీడర్ల పరిధిలో, ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 11 కేవీ నందగిరి హిల్స్, హైటెక్ సిటీ, సీఓడి ఫీడర్ల పరిధిలో, మధ్యాహ్నం 12 నుంచి 12.30 గంట వరకు 11 కేవీ ఆర్ట్ గ్యాలరీ ఫీడర్ పరిధిలో, మధ్యాహ్నం 1 గంట నుంచి 1.30 వరకు 11 కేవీ బంజారాహిల్స్ రోడ్ నెంబర్-14, అయ్యన్న ప్లైడ్, బీవీ భవన్ ఫీడర్ల పరిధిలో, మధ్యాహ్నం 1.30 నుంచి 2 గంటల వరకు 11కేవీ దివ్య డైమండ్, బీఎస్ఎన్ఎల్, లుంబిని మాల్ ఫీడర్ల పరిధిలో, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు 11 కేవీ రామానాయుడు స్టూడియో ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో కరెంట్ సరపరా ఉండదని తెలిపారు.

గ్రీన్ ల్యాండ్స్ ఏడీఈ పరిధిలో...

మరమ్మతుల కారణంగా గ్రీన్ ల్యాండ్స్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ బానోతు చరణ్ సింగ్ తెలిపారు. ఉదయం 10.30 నుంచి 11 గంటల వరకు 11 కేవీ బేగంపేట కామత్ లింగాపూర్ హౌస్, ప్రకాష్ నగర్ ఫీడర్ల పరిధిలో, ఉదయం 11 నుంచి 11.30 గంట వరకు బేగంపేట నాలా ఫీడర్ పరిధిలో, ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12 గంట వరకు 11 కేవీ ఎస్ఆర్‌నగర్, అవంతినగర్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదని తెలిపారు.

సైఫాబాద్ పరిధిలో...

మరమ్మతుల కారణంగా సైఫాబాద్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ ప్రేమానంద్ పాయ్ తెలిపారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఎర్రమంజిల్ సబ్ స్టేషన్ అనుగ్రహ ఫీడర్ పరిధిలోని అనుగ్రహ అపార్ట్‌మెంట్, నవీన్‌నగర్, శారద అపార్ట్‌మెంట్ ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

వరద బాధితులకు నిత్యావసరాల పంపిణీ

ఖైరతాబాద్, సెప్టెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): లక్డీకాపూల్‌లోని ఐఐఎంసీ కళాశాల జాతీయ సేవాపథకం ఆధ్వర్యంలో ఇటీవల కురిసిన వర్షాలకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ముంపునకు గురైన మణుగూరులో గుర్తించిన 300 వరద బాధిత కుటుంబాలకు నాలుగు లక్షల విలువగల 300 నిత్యావసర సరుకుల కిట్లు పంపిణీ చేశారు. ఈ కిట్లలో బియ్యం, కందిపప్పు, చక్కర, రవ్వ, బ్లాంకెట్, టవల్, సబ్బులు, మందులు 15 రకాల సరుకులు ఉన్నాయని కళాశాల ప్రిన్సిపాల్ ఎన్ఎస్ఎస్ ఛైర్మన్ కె.రఘువీర్ తెలిపారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ 2 ప్రోగ్రాం ఆఫీసర్ ఇ.రామకృష్ణ, ఎన్‌సీసీ ఆఫీసర్ వసంత్ కుమార్ ఆధ్వర్యంలో ఐఐఎంసి కళాశాల, జాతీయ సేవా పథకం వలంటీర్లు 15 మంది, ఎన్‌సీసీ క్యాడెట్స్ 15 మంది, అధ్యాపకులు విజయానంద్, విజయ్, కిషన్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ కరుణాకర్ రెడ్డి

పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలి

అడ్డగుట్ట, సెప్టెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): పండుగలను కులమతాలకు అతీతంగా శాంతియుతంగా జరుపుకోవాలని సీఐ కరుణాకర్‌రెడ్డి అన్నారు. మిలాద్-ఉన్-నబీ నేపథ్యంలో లాలాగూడ, శేశాపహాడ్, తార్నాక, శాంతినగర్, లాలాపేట్ పరిసర ప్రాంతాల ముస్లిం మతపెద్దలు, పీస్ కమిటీ సభ్యులతో శుక్రవారం లాలాగూడ పోలీస్‌స్టేషన్‌లో ప్రత్యేకంగా సీఐ సమావేశమయ్యారు. పండుగల సందర్భంగా ఎటువంటి గొడవలు జరగకుండా సామరస్యంగా జరుపుకోవాలని సూచించారు. ఏవైనా సమస్యలు ఉంటే విధి నిర్వహణలో ఉన్న పోలీసులకు లేదా కంట్రోల్ రూంలో సమాచారం ఇవ్వాలని చెప్పారు. సమావేశంలో ఎస్సై నాగరాజు, షాహెద్, పీస్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



జాతీయ పోషణ మహోత్సవాల బ్యానర్‌ను ప్రదర్శిస్తున్న చిన్నారులు, టీచర్లు

పిల్లలకు పౌష్టికాహారం అందించాలి

అడ్డగుట్ట, సెప్టెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు పిల్లలకు పౌష్టికాహారం అందించాలని ఐసీడీఎస్ అధికారులు సూచించారు. చిన్నారులు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకుని తరచూ వైద్య పరీక్షలు చేయించాలని వారన్నారు. జాతీయ పోషణ మహోత్సవాలు ఈ నెల 1న ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా శుక్రవారం అడ్డగుట్ట ఆరోగ్య కేంద్రంలో తుకారంగేట్, అడ్డగుట్ట అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ నెల 30న జాతీయ పోషణ మహోత్సవాలు ముగుస్తాయని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అడ్డగుట్ట ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి వీరు, అడ్డగుట్ట అంగన్‌వాడీ టీచర్లు శోభారాణి, రేణుక, పద్మ, పద్మావతి, అనితలక్ష్మి, స్వరూప పాల్గొన్నారు.

తైక్వాండోలో అవనీష్‌కు స్వర్ణం



గోల్డ్ మెడల్‌తో అవనీష్ బొలిశెట్టి

తిరుమలగిరి సెప్టెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): తిరుమలగిరి ఎస్‌బీహెచ్ కాలనీకి చెందిన కిరణ్ కుమారుడు అవనీష్ బొలిశెట్టి గోల్డ్‌మెడల్ సాధించాడు. తమిళనాడు రాష్ట్రం మద్రాస్ కరైకుడి చెట్టినాడ్‌లో ఈ నెల 10వ తేదీ నుంచి 13వ తేదీ వరకు 14 ఏళ్ల నుంచి 32 ఏళ్లలోపు వారికి తైక్వాండో పోటీలు నిర్వహించారు. 35 కిలోల బాలుర విభాగంలో పాల్గొన్న అవనీష్ స్వర్ణ పతకం కైవసం చేసుకుని జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. శుక్రవారం నగరానికి వచ్చిన అవనీష్‌కు తల్లిదండ్రులు స్వాగం పలికారు. అవనిష్ ఆర్టీసీ కాలనీలోని కాంబాట్ తైక్వాండో, స్పోర్ట్స్ అకాడమీలో కోచ్ నరసింహ మాస్టర్ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్నాడు.

తైక్వాండో డెలిగేట్‌గా బాబులాల్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): హైదరాబాద్ తైక్వాండో క్రీడాకారుడు జె.బాబులాల్‌కు అరుదైన గౌరవం లభించింది. సీబీఎస్‌ఈ సౌత్ జోన్-2 క్రీడా పోటీలకు తెలంగాణ నుంచి బాబులాల్‌ను టెక్నికల్ డెలిగేట్‌గా ఎంపికయ్యాడు. ఈనెల 20 నుంచి 23 వరకు నాలుగు రోజుల పాటు మహారాష్ట్రలో జరగనున్న ఈ పోటీలకు డెలిగేట్‌గా బాబులాల్ వ్యవహరించనున్నాడు. ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్లు లక్ష్మీకాంత్‌రాథోడ్, రాజేశ్, ప్రభాకర్‌రావు బాబులాల్‌ను అభినందించారు.



స్వాధీనం చేసుకున్న గంజాయి, పోలీసుల అదుపులో నిందితుడు

18,450 కిలోల గంజాయి పట్టివేత

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, సెప్టెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో 18,450 కిలోల గంజాయిని రైల్వే పోలీసులు పట్టుకున్నారు. శుక్రవారం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో జీఆర్‌పీ ఆర్పీఎఫ్ ఎస్ఐబీ అధికారులు తనిఖీలు చేస్తున్నారు. ప్లాట్‌ఫాంపై ఒడిశాకు చెందిన సుదర్శన్ నాహక్(54) రైలు కోసం వేచి చూస్తున్నాడు. అతడి బ్యాగును తనిఖీ చేయగా 18.450 కిలోల గంజాయి పట్టుబడింది. నిందితుడిని విచారించగా ఒడిశా నుంచి సికింద్రాబాద్ మీదుగా మహారాష్ట్ర గంజాయి తీసుకెళ్తున్నట్టు చెప్పాడు. గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్ట్ రిమాండ్‌కు తరలించామని సికింద్రాబాద్ రైల్వే ఎస్పీ జావెద్, రైల్వే ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ్ తెలిపారు.

తక్కువ ధరకు బంగారు ఆభరణాలు చేసి ఇస్తానని మోసం.. నిందితుడి అరెస్ట్

బౌద్ధనగర్, సెప్టెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): బంగారు ఆభరణాలను తక్కువ ధరకు చేసి ఇస్తానని మోసం వ్యక్తిని చిలకలగూడ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ అనుదీప్, డీఐ రమేష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన శివకుమార్ సోనకార్(37) మూడేళ్ల క్రితం నగరానికి వచ్చి చిలకలగూడ ప్రధాన రహదారి పక్కన 'ఉదయ్‌బన్ జువెలర్స్' పేరుతో గోల్డ్ దుకాణం నడుపుతున్నాడు. దుకాణానికి వచ్చిన కస్టమర్లకు తక్కువ ధరకు బంగారు అభరణాలు తయారు చేసి ఇస్తానని మాయమాటలతో నమ్మించాడు. వారి నుంచి లక్షల్లో వసూల్ చేశాడు. రోజులు గడుస్తున్న బంగారు ఆభరణాలు ఇవ్వకపోడంతో మోసపోయామని గ్రహించిన బాధితులు పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడు శివకుమార్‌ను శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాంపై ప్రయాణికుడి మృతి



మృతిచెందిన దాస్

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, సెప్టెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుడు మృతిచెందాడు. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ డేవిడ్‌రాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమ బెంగాల్‌కు చెందిన దాస్(26) బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి మణికొండ ప్రాంతంలో అద్దెకు ఉంటున్నాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న దాసు సొంతూరు వెళ్లేందుకు శుక్రవారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వచ్చాడు. ఒకటో నంబర్ ప్లాట్‌ఫాంపై కుప్పకూలి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించామని హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బ తీయొద్దు

ఉద్రిక్తతల నేపథ్యంలో ముందస్తుగా పలువురు ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నేతల గృహనిర్బంధం



మారేడుపల్లిలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను గృహ నిర్బంధం చేసిన పోలీసులు

సికింద్రాబాద్/బౌద్ధనగర్/అడ్డగుట్ట, సెప్టెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బ తీయవద్దని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే అన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి నివాసంపై కాంగ్రెస్ పార్టీ శ్రేణులు దాడి జరిపిన నేపథ్యంలో శుక్రవారం వెస్ట్‌మారేడుపల్లిలోని తలసాని నివాసంలో ఆయనను పోలీసులు ముందు జాగ్రత్త చర్య కింద హౌజ్ అరెస్టు చేశారు. బయటకు వెళ్లకుండా అడ్డుకున్నారు. 'తన ఆరోగ్యం బాగాలేదని, డాక్టర్ వద్ద అపాయింట్‌మెంట్ ఉందని, తనను వెళ్లనివ్వాలని' తలసాని కోరారు. పోలీసులు మాత్రం అంగీకరించలేదు. దాంతో తలసాని ఇంటికే పరిమితమయ్యారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ దాడులు, ప్రతిదాడులు ప్రజాస్వామ్యంలో సరియైనవి కావన్నారు. దాడులు చేయడం, రెచ్చగొట్టడం తదితర చర్యలతో హైదరాబాద్ నగరంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించవద్దని అన్నారు. సమస్యకు పరిష్కారం చూడకుండా అరెస్టులు, అడ్డుకోవడాలు తగవని పేర్కొన్నారు. బీఆర్ఎస్ రాంగోపాల్‌పేట్ డివిజన్ ఇన్‌చార్జి అత్తెల్లి శ్రీనివాస్‌గౌడ్, మోండా మార్కెట్ డివిజన్ అధ్యక్షుడు హరికృష్ణ తదితరులను పోలీసులను గృహనిర్బంధం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ పాలన ఎమర్జెన్సీని తలపిస్తుందని, అక్రమ అరెస్టులు, గృహనిర్బంధాలతో ప్రజలు, ప్రతిపక్ష పార్టీల గొంతును నొక్కివేయలేరని పలువురు బీఆర్ఎస్ నాయకులు అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ శ్రేణుల మధ్య జరుగుతున్న పరిమణాల నేపథ్యంలో ముందస్తు గొడవలు జరగకుండా పోలీసులు పలువురు కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలను ఇంటి నుంచి బటయకు వెళ్లకుండా గృహనిర్బంధం చేశారు. శుక్రవారం తెల్లవారుజామున చిలకలగూడ, బౌద్ధనగర్ కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజను, అడ్డగుట్టలో కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి పోలీసులు గృహనిర్బంధం చేసి అనంతరం పోలీస్ స్టేషన్లకు తరలించారు. తుకారాంగేట్‌లో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్‌ను ఇంటినుంచి బయటకు వెళ్లకుండా హౌజ్ అరెస్ట్ చేశారు. బయటి వ్యక్తులు ఎవరు వారి ఇంట్లోకి వెళ్లకుండా పోలీసులు పహారా ఉన్నారు. సొంత పూచీకత్తులపై సాయంత్రం వారిని ఇంటికి పంపించి వేశారు.



బౌద్ధనగర్ కార్పొరేటర్ కంది శైలజను హౌస్ అరెస్ట్ చేసిన వారాసిగూడ పోలీసులు



గృహనిర్బంధంలో సీతాఫల్‌మండి కార్పొరేటర్ హేమ

'హైడ్రా'కు, సీఎంకు ఒవైసీ కాలేజీలను కూల్చే దమ్ముందా?

బోయిన్‌పల్లి, సెప్టెంబర్ 13(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీల మధ్యజరిగిన గొడవతో బీఆర్ఎస్ శ్రేణులు శుక్రవారం ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ నివాసం ముట్టడికి పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో శంబీపూర్ రాజు, కౌశిక్‌రెడ్డిలను కలవడానికి బయలుదేరిన మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని పోలీసులు బోయిన్‌పల్లి సౌజన్యకాలనీ బీఆర్ఎస్ క్యాంపు కార్యాలయంలో అడ్డుకొని కార్యాలయం గేట్లను మూసివేశారు. పోలీసులకు రాజశేఖర్‌రెడ్డి కార్యకర్తలకు మధ్య వాగ్వాదం జరిగింది. తనను నిర్బంధించాలని ఉన్నతాధికారులు జారీచేసిన ఉత్తర్వులు ఉంటే తనకు చూపించాలని ఎమ్మెల్యే పోలీసులను అడిగాడు. బోయిన్‌పల్లి ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణరెడ్డి ఘటన స్థలానికి చేరుకుని తమవద్ద ఉత్తర్వులు ఉన్నాయని, అధికారికంగానే ఎమ్మెల్యేలను గృహ నిర్బంధించినట్లు పేర్కొనడంతో ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి తన ప్రయత్నాన్ని విరమించుకున్నారు. అక్కడే ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఓ చాతగాని ప్రభుత్వం, పాలన చేతగాని సీఎం, ప్రజా సమస్యలు పట్టించుకోని కాంగ్రెస్ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అనేక సమస్యలతో ప్రజలు అల్లాడుతుంటే కాంగ్రెస్ గరీబోళ్ల ఇళ్లను కూలుస్తుందన్నారు. ప్రభుత్వం మల్లారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, పల్ల రాజేశ్వర్‌రెడ్డిలనే టార్గెట్ చేస్తున్నారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి, హైడ్రాకు దమ్ము ఉంటే ఒవైసీ కాలేజీలను కూల్చాలన్నారు. పేద ప్రజలు కట్టుకున్న ఇళ్లను కూల్చడం సరికాదన్నారు.



ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డిని బయటకు వెళ్లకుండా అడ్డుకుంటున్న పోలీసులు

ప్రజా సమస్యలను పక్కదారి పట్టించడానికే డ్రామాలు

బోయిన్‌పల్లి, సెప్టెంబర్ 13(ఆంధ్రజ్యోతి): 'కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సిటీ అంతా అల్లకల్లోలమైనదని, సీఎం రేవంత్‌రెడ్డికి పాలన రావడంలేదు. ప్రజా సమస్యలు పక్కదారి పట్టించేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం డ్రామాలు ఆడుతుందని' మాజీమంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీల మధ్య జరిగిన గొడవతో రాష్ట్రంలో రాజకీయం ఒక్కసారిగా ముదిరి వేడెక్కింది. ఈ నేపథ్యంలో నగరంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా శుక్రవారం ముందస్తు చర్యలు చేపట్టారు. ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ ఇంటికి బయలుదేరిన బీఆర్ఎస్ నాయకులను, ఎమ్మెల్యేలను, మాజీ మంత్రులను ఎక్కడికక్కడే పోలీసులు అరెస్టు చేశారు. ఈ క్రమంలో బోయిన్‌పల్లిలోని మాజీ మంత్రి మల్లారెడ్డి నివాసానికి వెళ్లి అతడిని గృహనిర్బంధం చేశారు. తన కుమారుడుఇ ఆరోగ్యం బాగాలేకపోవడంతో అతనిని చూడడానికి వెళ్తున్నానని చెప్పినా వినకుండా గృహ నిర్బంధం చేసి ఇంటిచుట్టూ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. బోడుప్పల్ మునిసిపల్ బీఆర్ఎస్ నాయకుడు సంజీవ రెడ్డి ఆధ్వర్యంలో అక్కడికి రాగా వారిని నిర్బంధించారు. మల్లారెడ్డి తన నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గురువారం గాంధీని ఒక్కడిని ఆపితే ఈ గొడవ ఉండేదికాదన్నారు. వాళ్లకో న్యాయం... మాకో న్యాయమా అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇంత జరుగుతుంటే ఎక్కడుంది ప్రజాస్వామ్యం, ఎట్లా ఇందిరమ్మ రాజ్యం అని మల్లారెడ్డి అన్నారు. ఆరు గ్యారెంటీలను అమలుచేయలేకనే కాంగ్రెస్ పార్టీ డ్రామాలు ఆడుతున్నదన్నారు.



ఎమ్మెల్యే మల్లారెడ్డి

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తా: తలసాని

పద్మారావునగర్, సెప్టెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): మేకలమండి ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తానని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పాఠశాల కమిటీ సభ్యులకు హామీనిచ్చారు. స్థానికులతో కలిసి కొందరు జర్నలిస్టులు మేకలమండి పాఠశాల అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. శుక్రవారం పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పాఠశాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జర్నలిస్టులు తమ వృత్తిధర్మం పాటిస్తూనే, నిస్వార్థంగా ప్రభుత్వ పాఠశాలను దత్తత తీసుకొని అభివృద్ధి చేయడానికి ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. పేద విద్యార్థులు అధికంగా విద్యనభ్యసిస్తున్న ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తానని అన్నారు. ఇప్పటికే బన్సీలాల్‌పేట్ డివిజన్‌లోని మేకలమండి ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి రూ.2.82 కోట్లు మంజూరు చేయించానని తెలిపారు.

నూతన భవన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ చెప్పారు. ఉన్నత పాఠశాలగా అప్ గ్రేడ్ చేయాలని విద్యాశాఖకు లేఖను పంపించానని తెలియజేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఈ.చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు రాజు, ప్రధాన కార్యదర్శి బి.నర్సింగరావు, కోశాధికారి వీజే శేష గిరిరావు, కార్యదర్శి మల్లికార్జునరెడ్డి తదితరులు ఉన్నారు.



ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఏసీపీ శంకర్ రాజు

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకోవాలి

అడ్డగుట్ట, సెప్టెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకోవాలని బేగంపేట ట్రాఫిక్ శిక్షణ కేంద్రం ఏసీపీ శంకర్‌రాజు విద్యార్థులకు సూచించారు. శుక్రవారం సికింద్రాబాద్‌లోని ఓ ప్రైవేట్ కాలేజీలో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన శంకర్‌రాజు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ యవత ట్రిపుల్ రైడింగ్ చేస్తూ ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ఈ ఏడాది 1500 మంది లైసెన్స్ లేని వారికి, 100 మంది ట్రిపుల్ రైడింగ్ చేసిన వారికి బేగంపేట్‌లోని ట్రాఫిక్ టీటీఐ కేంద్రంలో కౌన్సిలింగ్ ఇచ్చామన్నారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే జరిమానాతోపాటు మూడు నెలల జైలు శిక్షను విధిస్తారన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీస్ అధికారి వెంకట ప్రసాద్ పాల్గొన్నారు.

నైపుణ్య శిక్షణ పొందిన యువతకు మంచి ఉద్యోగ అవకాశాలు

ఎస్పీ కళాశాలలో 'సెల్లింగ్ స్కిల్స్' శిక్షణ

పద్మారావునగర్, సెప్టెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): విద్యతోపాటు, నైపుణ్య శిక్షణ పొందిన విద్యార్థులు, యువతకు మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ఐసీఐసీఐ బ్యాంక్ ప్రతినిధులు పేర్కొన్నారు. శుక్రవారం పద్మారావునగర్‌లోని సర్దార్ పటేల్ (ఎస్పీ) కళాశాలలో ఐసీఐసీ ఫౌండేషన్ 'సెల్లింగ్ స్కిల్స్' ల్యాబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎన్ హేమలత మాట్లాడుతూ డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు రోజుకు ఒక గంట చొప్పున అకాడమిక్, ఇండస్ట్రీల నడుమ గ్యాప్ లేకుండా ఉచితంగా శిక్షణ ఇవ్వటానికి, సామాజిక సేవలో బాగంగా ఐసీఐసీఐ సంస్థ 41 కంప్యూటర్లతో ల్యాబ్ ఏర్పాటుచేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థులకు రిటెయిల్ రంగంలో శిక్షణ ఇచ్చి వారికి సర్టిఫికేట్లను అందజేయనున్నారు. జాబ్ మేళా నిర్వహించి ఉద్యోగ కల్పనలో సహకారం అందించనున్నామని, కళాశాలలో స్కిల్స్‌పై ఉచితంగా శిక్షణ పొందటం ఈ తరం విద్యార్థుల అదృష్టమని ఐసీఐసీ ప్రతినిధులు అన్నారు. కార్యక్రమంలో ఐసీఐసీఐ ఫౌండేషన్ జోనల్ హెడ్ ఆసిఫ్ ఇక్బాల్, జోనల్ రిటెయిల్ హెడ్ రాజీవ్ మాదిరెడ్డి, బ్యాంక్ టాస్క్ హెడ్ పి.శివ,రీజినల్ టాస్క్ హెడ్ టీ. శరత్, ప్రాజెక్ట్ మేనేజర్ పి.సైమన్ రాజ్, కళాశాల కార్యదర్శి జి.వి. రంగారెడ్డి, కోశాధికారి శ్రీనివాస్‌రావు, ఓజీఏ అధ్యక్షులు ప్రొఫెసర్. గోపాలచారి, ఎగ్జిబిషన్ సొసైటీ సభ్యులు సత్యేందర్,వైస్ ప్రిన్సిపాల్ అమరనాథశర్మ, పరినాలనా అధికారి రాహుల్ పాల్గొన్నారు.



శిక్షణా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఐసీఐసీఐ అధికారులు



ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంకు వినతిపత్రం అందజేస్తున్న పరిశోధక విద్యార్థులు, ఓయూ విద్యార్థి సంఘాల నాయకులు

యూనివర్సిటీల కామన్ రిక్రూట్‌మెంట్ బోర్డు రద్దుకు చొరవ తీసుకోండి

తార్నాక, సెప్టెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీల కామన్ రిక్రూట్‌మెంట్ బోర్డును రద్దు చేయాలని పలువురు పరిశోధక విద్యార్థులు, ఓయూలోని విద్యార్థి సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్సీ ప్రొ. కోదండరాంను తార్నాకలోని ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసేలా కామన్ రిక్రూట్‌మెంట్ బోర్డు ప్రతిపాదనలు ఉన్నాయని, విద్యార్థులు తరఫున సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి యూనివర్సిటీల కామన్ బోర్డు రద్దుకు చొరవ తీసుకోవాలని వారు కోదండరామ్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించని పక్షంలో తెలంగాణలోని ప్రజా సంఘాలను, మేధావులను, రాజకీయ పార్టీలను కలుపుకుని దశలవారీగా పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు ఎస్. నాగేశ్వర్‌రావు, ఆర్.ఎల్ మూర్తి, కోట శ్రీనివాస్, నిజ్జన రమేష్, ఎస్.సుమంత్, రవినాయక్, సలీం పాషా, ఆశప్ప తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు 'స్టూడెంట్ ఓరియెంటెడ్' పద్ధతిలో బోధించాలి

'ఔట్ కమ్ బేస్‌డ్ ఎడ్యుకేషన్ ఇన్ మేనేజ్‌మెంట్ స్టడీస్'పై అధ్యాపకులకు ఒకరోజు శిక్షణ

తార్నాక, సెప్టెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): ఓయూలోని ఆంధ్ర మహిళా సభ స్కూల్ ఆఫ్ ఇన్ఫర్మటిక్స్ సెమినార్ హాల్‌లో శుక్రవారం 'ఔట్ కమ్ బేస్‌డ్ ఎడ్యుకేషన్ ఇన్ మేనేజ్‌మెంట్ స్టడీస్' అంశంపై అధ్యాపకులకు ఒక్కరోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన యూనివర్సిటీ ఆఫ్ హైద్రాబాద్ (హెచ్‌సీయూ) సీనియర్ ప్రొ. బి. రాజశేఖర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఎంబీఏ మేనేజ్‌మెంట్ విభాగం అధ్యాపకులకు ఆధునిక బోధన పద్ధతులను క్షుణ్ణంగా వివరించారు. ప్రధానంగా అధ్యాపకులు తాము బోధించే పాఠ్యాంశం విద్యార్థులకు సులభంగా అర్థమయేలా స్టూడెంట్ ఓరియెంటెడ్ పద్ధతిలో బోధించాలని సూచించారు. ఆధునిక సమాజంలో మారుతున్న టెక్నాలజీ అనుగుణంగా అధ్యాపకులు ఎప్పటికప్పుడు తమ వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. అనంతరం శిక్షణ కార్యక్రమానికి హాజరైన అధ్యాపకులకు ఓయూ కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్ వి.సుధ ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ప్రొ. విజయలక్ష్మి, ఛైర్‌పర్సన్ డా. ఏ. రమాదేవి, సెక్రటరీ వై. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రొఫెసర్ రాజశేఖర్, కళాశాల డైరెక్టర్ విజయలక్ష్మి తదితరులు

భక్తిశ్రద్ధలతో నవరాత్రి ఉత్సవాలు

పూజలు చేసిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సతీమణి కావ్యారెడ్డి



పూజలు చేస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సతీమణి కావ్యారెడ్డి

బౌద్ధనగర్ / తిరుమలగిరి / అమీర్‌పేట / సికింద్రాబాద్, సెప్టెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకొంటున్నారు. సీతాఫల్‌మండి, బౌద్ధనగర్ డివిజన్లలో ఏర్పాటు చేసిన మండపాల్లో వినాయకుడి విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్నారు. మధురానగర్ కాలనీలోని బీజేపీ కార్యాలయంలో మేకల కీర్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద కేంద్రమంతి జి. కిషన్‌రెడ్డి సతీమణి కావ్యారెడ్డి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. బౌద్ధనగర్‌లో నేతాజీ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి మండపం వద్ద బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు పి.రవిప్రసాద్‌గౌడ్, మద్దెర్ల శ్యాంసుందర్ ప్రత్యేక పూజలు చేశారు. ఆయా కార్యక్రమాలలో మాజీ కార్పొరేటర్ మేకల సుజాత సారంగపాణి, నాగరాణి, లావణ్య తదితరులు పాల్గొన్నారు. గన్‌రాక్ టీచర్స్ కాలనీ ఎక్స్‌రోడ్డులో 7వ వార్డ్ బీజేపీ అధ్యక్షుడు ప్రభుప్రశాంత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుడి మండపంలో కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యుడు జే.రామకృష్ణ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఎస్ఆర్‌నగర్ ఎస్ఆర్టీలో గణేష్ మహిళా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు అయిన వినాయక మండపంలో మహిళలతో కలిసి మాజీ కార్పొరేటర్ శేషకుమారి ప్రత్యేక పూజలు చేశారు. హస్మత్‌పేట్ కౌండిన్య యువసేన ఆధ్వర్యంలో వినాయక నవరాత్రోత్సవాల్లో భాగంగా వినాయకుని లడ్డూను వేలం వేశారు. వేలం పాటలో పట్నం మధుసూదన్ గౌడ్ కుమారుడు పట్నం విజయానంద్ లక్షా 21వేల రూపాయలకు లడ్డూను సొంతం చేసుకున్నారు.



టీచర్స్ కాలనీలో మండపం వద్ద పూజలు చేస్తున్న కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యుడు జే.రామకృష్ణ



వేలం పాటలో లడ్డూను కైవసం చేసుకున్న విజయానంద్



ఎస్ఆర్‌నగర్‌లో మహిళలతో కలిసి ప్రత్యేక పూజలు చేసిన శేషుకుమారి